జాతీయ సదస్సులో రజియా..



వరంగల్ సిటీ, జనవరి 19: కేంద్ర ప్రభుత్వ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మండల సమాఖ్యల్లో పాలనను పటిష్ఠం చేయడం అనే అంశంపై గురువారం ఢిల్లీలో నిర్వహించిన సదస్సులో నర్సంపేటలోని ఆదర్శ మండల సమాఖ్య ప్రతినిధి ఎండీ.రజియా పాల్గొన్నారు. 2021-22 సంవత్సరానికి జాతీయస్థాయిలో ఉత్తమ మండల సమాఖ్యగా ఎంపికకాగా, రజియాను సదస్సుకు ఆహ్వానించారు. సదస్సులో రజియా క్లస్టర్ లెవల్ ఫెడరేషన్ ప్రాముఖ్యత, ఆర్థికఅంశాలు, జీవనోపాధులు, సంస్థ పురోగతిపై ప్రసంగించారు. సమాఖ్య సభ్యులు వీణరెడ్డి, శ్వేత, కవిత పాల్గొన్నారు.

నిట్‌లో సాంకేతిక సంబురం

ఉత్సాహంగా మొదలైన టెక్నోజియాన్

- వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు
- 40కి పైగా ఈవెంట్ల నిర్వహణ
- క్యాంపస్‌లో సందడి చేస్తున్న మినీ భారతం
- కొత్త సాంకేతిక ఆవిష్కరణలకు ఊపిరి
- నేడు, రేపు కొనసాగనున్న వేడుకలు



టెక్నోజియాన్‌లో నగరానికి చెందిన పాఠశాల విద్యార్థి తయారు చేసిన ఎగ్జిబిట్ గురించి అడిగి తెలుసుకుంటున్న నిట్ విద్యార్థి



టెక్నోజియాన్‌ను ప్రారంభిస్తున్న నిట్ కళాశాల రీసెర్చ్ కన్సల్టెన్సీ డీన్ వి.టి. సోమశేఖర్

నగరంలోని ప్రతిష్ఠాత్మక నిట్‌లో సాంకేతిక ఉత్సవం 'టెక్నోజియాన్-2024' శుక్రవారం సందడిగా మొదలైంది. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికితీయడంతో పాటు పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకునేందుకు నిట్ ప్రతీ ఏటా 'టెక్నోజియాన్'ను నిర్వహిస్తోంది. ఈనెల 21 వరకు మూడు రోజుల పాటు జరిగే ఈ వేడుకలో 40కిపైగా ఈవెంట్లను ప్రదర్శిస్తారు. దేశంలోని వివిధ నిట్ కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు ఈ ఈవెంట్లలో పాలుపంచుకోనున్నారు. ఈ సంవత్సరం ఇంజీనియస్ థీమ్‌తో నిర్వహిస్తున్నారు. ఈ వేడుకను శుక్రవారం ప్రఖ్యాత ఎరోస్పేస్, మిస్సైల్ సైంటిస్టు ప్రొఫెసర్ సుందర రాజన్ ప్రారంభించాల్సి ఉండగా, అనారోగ్య కారణాలతో హాజరుకాలేక పోయారు. దీంతో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి. సోమశేఖర్ టెక్నోజియాన్‌ను ప్రారంభించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థుల తో క్యాంపస్ అంతటా మినీ భారతం కళ్లకు కడుతోంది.

-ఆంధ్రజ్యోతి, హనుమకొండ/కాజీపేట

గణతంత్ర వేడుకలకు ఆహ్వానం

ఢిల్లీ వెళ్లనున్న గంగదేవిపల్లికి చెందిన దంపతులు



సరోజన, రాజశేఖర్

గీసుగొండ, జనవరి 19: ఢిల్లీలో నిర్వహించే గణతంత్ర వేడుకలకు మండలంలోని జాతీయ ఆదర్శగ్రామం గంగదేవిపల్లికి చెందిన మహిళా స్వయం సహాయక సంఘం ప్రతినిధి కూసం సరోజనతోపాటు ఆమె భర్త రాజశేఖర్‌కు శుక్రవారం ఆహ్వానం లభించింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సెర్ప్‌ఆఫీస్ నుంచి వారికి ఆహ్వానాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈనెల 26న జరిగే వేడుకల్ని వారు ప్రత్యక్షంగా తిలకించనున్నా రు. యమునా మహిళా సంఘం ప్రతినిధిగా సరోజన చురుకుగా పని చేస్తున్నారు. సరోజన, రాజశేఖర్ దంపతులకు ఇద్దరు కుమారులున్నారు. పొదుపు సంఘం నుంచి రుణాన్ని తీసుకొని కుటీర పరిశ్రమగా ఆయిల్ మిల్లును నడుపుతుండగా, రాజశేఖర్ ట్రాలీ వాహనంలో పల్లీనూనెను మార్కెట్ చేస్తున్నారు.

సరోజన దంపతులకు అరుదైన గణతంత్ర వేడుకలకు ఆహ్వానం లభించటంతో డీఆర్‌డీఏ పీడీ సంపత్‌రావు, సర్పంచ్ గోనె మల్లారెడ్డి, గ్రామస్థులు అభినందించారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

ఖిలావరంగల్ కోటలో ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 19: ఈనెల 26న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారుల సమావేశంలో వేడుకలపై పలు సూచనలు చేశారు. ఖిలా వరంగల్‌లోని ఖుష్‌మహల్ ఆవరణలో 26న ఉదయం 9 గంటలకు నిర్వహించే వేడుకలు విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని డీఈవోను ఆదేశించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు, ఉత్తముల పేర్లను 23లోపు సిఫారస్ చేయా లన్నారు. డీఆర్‌వో ఆధ్వర్యంలో కమిటీ ఆ పేర్లను పరిశీలించి 24 ఉదయం సమర్పించాలన్నారు. పోలీసు కవాతు నిర్వహణ పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని పోలీసులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశ్వినితానాజీ వాకడే, ఆర్‌డీవోలు వాసుచంద్ర, కృష్ణవేణి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో సంపత్‌రావు, డీపీవో కల్పన, డీఈవో వాసంతి, మునిసిపల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, కమిషనర్

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

ఓటరు నమోదు పెండింగ్ దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని 2024 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన అధికారి వికాస్‌రాజ్ ఇతర ముఖ్య ఎన్నికల అధికారులు ఓటరు నమోదు కార్యక్రమం పార్లమెంట్ ఎన్నికల సన్నద్ధతపై జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్‌డీవో కృష్ణవేణి, వాసుచంద్ర, అధికారులు పాల్గొన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పూర్తి స్థాయిలో అభ్యంతరాలను పరిష్కరించి తుది జాబితా రూపొందించాలన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఓటరు నమదు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికలకు ఎన్ని కల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం పోస్టల్ బ్యాలెట్, ఓట్ల జారీ, నమోదు, ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో శ్రీకాంత్ పాల్గొన్నారు.

బియ్యం రవాణాలో అంతరాయం కలగొద్దు..

జిల్లాలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ షాపులకు, ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలు, అంగన్‌వాడీ సెంటర్లకు బియ్యం రవాణాలో అంతరాయం ఏర్పడకుండా రవాణా వాహన టెండర్‌దారులు చూడాలని, ఏమైనా ఇబ్బంది ఏర్పడితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో 2023-25 సంవత్సరానికి సంబంధించిన బియ్యం రవాణా వాహనాలకు సంబంధించి టెండర్లను ఖరారు చేశారు. విధి విధానాలను త్వరలో తెలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం సంధ్యారాణి అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేద్దాం..

పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీ, ఆర్టీవో అధికారులు

హనుమకొండ క్రైం, జనవరి 19: ప్రభుత్వ విభాగాలు సమన్వయంతోపాటు ప్రజల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాలను నివారించాలని వరంగల్ పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్ ఝా పిలుపునిచ్చారు. ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14వరకు నిర్వహించే రోడ్డుభద్రతా మాసోత్సవాల సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం ఆర్టీవో అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ముందుగా చాంబర్ ఆఫ్ కామర్స్, బులియన్ మార్కెట్‌లతో పాటు ఇతర శాఖల ప్రతినిధులలతో కలిపి మాసోత్సవాల వాల్‌పోస్టర్ సీపీ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. దేశంలో గంటకు 50కిపైగా రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే 19 మంది మృత్యువాత పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రోజు రోజుకూ వాహనాల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడంతో అదే స్థాయిలో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ప్రధానంగా హైస్పీడ్ వాహనాల వినియోగంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల తరుచుగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయున్నారు. ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీ ఆదేశించారు. ప్రమాదాల నివారణకు ప్రజలతో పాటు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రోడ్డు సేఫ్టీ విభాగం ఇన్‌స్పెక్టర్ రవి రోడ్డు ప్రమాదాలు నివారణకు తీసుకోవలసిన మెళకువలు విశ్లేషించారు. ఈ సమావేశంలో ట్రెయినీ ఐపీఎస్ శుభంనాగ్, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ అధికారి పురుషోత్తం, ఆర్టీవో రంగారావు, ఏసీపీలు జితేందర్‌రెడ్డి, రమేష్‌కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్లు జి.సీతారెడ్డి, సుజాత, ఎంవీఐలు రమేష్ రాథోడ్, రవీందర్, స్వర్ణలత, శాలినీ, ఫహిమా పాల్గొన్నారు.

డీసీఎస్‌వోగా శివప్రసాద్‌రెడ్డి



వరంగల్ సిటీ, జనవరి 19: జిల్లా పౌర సరఫరాల అధికారి(డీసీఎస్‌వో)గా శుక్రవారం చల్లా శివప్రసాద్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీసీఎస్‌వోగా పని చేస్తున్న కె.చందన్‌కుమార్ బదిలీపై ఖమ్మం వెళ్లగా సంగారెడ్డి డీసీఎస్‌వోగా పనిచేస్తున్న శివప్రసాద్‌రెడ్డి వరంగల్ డీసీఎస్‌వోగా బాధ్యతలు స్వీకరించారు. కాగా హనుమకొండలోని జిల్లా పౌరసరఫరాల కార్పొరేషన్ మేనేజర్ కార్యాలయంలో మేనేజర్ బి.సంధ్యారాణి రైస్ మిల్లర్స్‌తో సమీక్షా సమావేశం నిర్వహించారు. 2022-23 వానాకాలం, యాసంగి సీఎంఆర్ డెలివరీస్‌పై వారితో చర్చించారు. ఈనెల 31 లోపు నిర్దేశిత సీఎంఆర్‌ను సరఫరా చేయాలని వారికి సూచించారు.

క్రీడా అసోసియేషన్లు వివరాలివ్వాలి

వరంగల్ కలెక్టరేట్, జనవరి 19: రాష్ట్ర క్రీడా సంస్థ ఆదేశాల మేరకు జిల్లాలో గుర్తింపు పొందిన క్రీడా అసోసియేషన్ల ప్రెసిడెంట్, సెక్రటరీల పేర్లు, ఫోన్ నంబర్ల వివరాలను ఉన్నతాధికారులకు అందజేయాలని జిల్లా యువజన క్రీడల శాఖా అధికారి టీవీఎల్. సత్యవాణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సంబంధిత క్రీడా సంఘాల బాధ్యులు ఈ నెల 20ను సాయంత్రం 4 గంటల లోపు వివరాలను జిల్లా యువజన క్రీడల కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. వివరాలకు సెల్ నంబర్లు : 7702155096 / 9948185608 లలో సంప్రదించగలరని కోరారు.



మార్మోగుతున్న రామ నామం

- అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలో వేడుకలు
- కొనసాగుతున్న ఇంటింటికి శ్రీరాముడి అక్షింతల వితరణ
- 22న ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రత్యేక పూజలు, అన్నదానాలకు ఏర్పాట్లు

వరంగల్ కలెక్టరేట్, జనవరి 9: అయోధ్యలో ఈనెల 22న శ్రీరాముడి ప్రాణప్రతిష్ఠ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పల్లెలు, పట్టణాలు జై శ్రీరాం నామస్మరణతో మార్మోగుతున్నాయి. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా అయోధ్య నుంచి తెచ్చిన అక్షింతలను రామభక్తులు ఇంటింటికీ తిరుగుతూ వితరణ చేస్తున్నారు. ఈ సందర్భంగా అట్టహాసంగా శోభాయాత్రలను నిర్వహిస్తున్నారు. అయోధ్య రామయ్య అక్షింతలకు మహిళలు మంగళహారతులు పడుతున్నారు. గ్రేటర్ వరంగల్‌లో రెండున్నర లక్షలకుటుంబాలు, వరంగల్ జిల్లాలో లక్షన్నర కుటుంబాలకు పంపిణీ చేశారు. అయోధ్యలో జరిగే శ్రీరామచంద్రుడి ప్రాణ ప్రతిష్ఠకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు స్వామి జీలకు విశ్వహిందూ పరిష త్ నుంచి ఆహ్వానం అందింది. అందులో వరంగల్ జిల్లా కు చెందిన స్వామి చైతన్యా నంద మహారాజ్, మరొకరు తొర్రూరు వెల్లికట్టే ప్రాంతానికి చెందిన స్వామి జ్ఞాన చైతన్యానంద స్వామి జీలకు 22న పాల్గొనే ఆహ్వానం అందింది.

వేయి దంపతులతో కల్యాణం, పట్టాభిషేకం


ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వరంగల్‌లోని ములుగురోడ్ ప్రాంతంలోని గురుధామంలో శ్రీ శివానంద గురు కల్చరల్ ట్రస్టు ఆధ్వర్యంలో వేయి మంది దంపతులతో 21న శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవం, అనంతరం శ్రీరాముడి పట్టాభిషేకం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కల్యాణ మహోత్సవంలో కూర్చున వారికి వెండి ప్రతిమ ఉచితంగా అందజేస్తారు. త ర్వాత అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు.

22న పూజలు, దీప జ్యోతులు, భజనలు ..

అయోధ్యలో రాముడి ప్రతిష్ఠ సందర్భంగా రామజన్మభూమి తీర్థ ట్రస్టు, విశ్వహిందూ పరిషత్ సంఘ్ పరివార్ సంస్థలు అనేక కార్యక్రమాలు చేపట్టాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22న ప్రతీ దేవాలయంలో ఉదయం 11 గంటల నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు శ్రీరామ జయరామ జయజయ రామా.. అనే మంత్రాన్ని 108 సార్లు పఠనం అనంతరం ఒకసారి హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహిస్తారు. అనంతరం ప్రతీ దేవాలయంలో ఎల్ఈడీ స్క్రీన్‌ను ఏర్పాటు చేయాలని, మధ్యాహ్నం 12.30 గంటలకు అయోధ్యలో జరిగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని లైవ్ ద్వారా భక్తులందరూ తిలకించాలని కోరారు. ప్రతిష్ఠ అనంతరం రాముడికి ఇచ్చే తొలి హారతిని దేశ ప్రజలందరు తిలకిం చాలన్నారు. సాయంత్రం ప్రతీ ఇంట్లో ఐదు రామ జ్యోతి దీపాలను వెలిగించి భవ్య దీపావళి పండుగ జరుపుకోవాలని విజయ సంకేతంగా ఇంటింటికి పంచిన రాముడి అక్షింతలను శిరస్సుపై చల్లుకోవాలని ట్రస్టు ప్రధాన కార్యదర్శి నందాల చందర్‌బాబు తెలిపారు.

అన్నదానాలకు ఏర్పాట్లు..

అయోధ్యలో రాముడి ప్రతిష్ఠ సందర్భంగా వరంగల్ నగరంలో హోమాలు, పూజలను ఏర్పాటు చేయనున్నారు. ములుగు రోడ్‌లోని రమాసత్యనారాయణ దేవాలయంలో లక్ష దీపోత్సవం, శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో శతశ్లోక రామాయణ పారాయణం, హనుమాన్ చాలీసా ఏర్పాటు చేశారు. అలాగే కొత్తవాడ శ్రీభక్త మార్కండేయ దేవాలయంలో మహా అన్నదానం, బట్టల బజార్ శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద, గీతా భవన్ వద్ద, పిన్నవారి వీధిలో బట్టల బజార్ వర్తక సంఘం ఆధ్వర్యంలో, వరంగల్ చౌరస్తాలో వేలాది మందికి దాదాపు 20 క్వింటాళ్ల బియ్యంతో మహా అన్నదానాన్ని ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం వరంగల్ క్రాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ చౌరస్తాలో క్రాకర్స్ షో ప్రసాద వితరణ ఏర్పాటు చేసినట్లు గండె కల్పన నవీన్ తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో జై శ్రీరాం వేయి జెండాలు, 2వేల కండువలు భక్తులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.





పతంగులు తెచ్చిన తంటా

ఇద్దరిపై దాడి చేసిన యువకులు.. కేసు నమోదు

హనుమకొండ క్రైం, జనవరి 19: సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఎగురవేసే పతంగుల పండగ ఘర్షణకు దారి తీసింది. ఒకరి గాలిప టాన్ని మరొకరు ఒకరు తెంపేయడంతో ఏర్పడిన గొడవ కొట్లాటకు దారి తీసింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమ కొండ రెడ్డికాలనీకి చెందిన చెన్నం నితిన్ సాయి ఈ నెల 16న తన ఇంటిపై గాలిపటం ఎగరేసుకుంటున్నాడు. ఇంటి సమీపంలో ఉన్న శివ, మింటూ, వీరస్వామి పతంగులు ఎగరేస్తున్నారు. ఈ క్రమంలో నితిన్ సాయి పతంగిని శివ, మింటూ, వీరస్వామిలు గాలిపటంతో కట్ చేశారు. విషయాన్ని నితిన్ సాయి తన తండ్రి శ్రీనివాస్‌కు చెప్పడంతో వారిని మందలించాడు. ఇది దృష్టిలో పెట్టుకున్న వారు ఇద్దరు శ్రీనివాస్, నితిన్ సాయిలపై పగ పెంచుకున్నారు. మరునాడు సాయంత్రం శ్రీనివాస్, నితిన్‌సాయిలు రెడ్డికాలనీలో వ్యక్తిగత పనిమీద వెళ్లి వస్తుండడంతో వారిని ముగ్గురు కలిసి అడ్డగించారు. నానా దుర్భాషలాడుతూ మీద పడి పిడి గుద్దులు గుద్దారు. దాడి చేసి చంపేస్తామని హెచ్చరించి వెళ్లిపోయారు. దీనిపై బాధితుడు శ్రీనివాస్ హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

కేయూ పార్మసీ డీన్‌గా గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, జనవరి 19: కేయూ ఫార్మసీ నూతన డీన్‌గా ప్రొఫెసర్ గాదె సమ్మయ్య నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు వెలువరించారు. బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్ గాదె సమ్మయ్యను వర్సిటీ ప్రొఫెసర్లు పి.మల్లారెడ్డి, ఎస్.ప్రసాద్, కృష్ణవేణి, నాగరాజు, పరిశోధకులు, విద్యార్థులు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు.

కాజీపేటలో చోరీ, నగదు మాయం


కాజీపేట, జనవరి 19: కాజీపేట జూబ్లీమార్కెట్‌లో ఓఇంట్లో చోరీ జరిగింది. దుండగులు నగదును దోచుకెళ్లారు కాజీపేట పోలీసుల వివరాలు ప్రకారం.. కాజీపేట జూబ్లీ మార్కెట్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాస్ కుటుంబసభ్యులతో కలిసి రెండు రోజుల కిందట ఇంటికి తాళం వేసి ఊరికి వెళ్లారు. తిరిగి శుక్రవారం ఇంటికి వచ్చే సరికి ఇంటి తాళం పగలగొట్టి ఉంది. దుండగులు ఇంట్లో బీరువా తలుపులు తీసి అందులో ఉన్న నగదు రూ.2 లక్షల 48 వేలు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కాజీపేట, జనవరి 19: కాజీపేట రైల్వే స్టేషన్‌లో శుక్రవారం ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. కాజీపేట రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్ 1లో శుక్రవారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా ఓ గుర్తుతెలియని మృతదేహం లభించింది. మృతుడి వయస్సు 50 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఎత్తు 5.5, ఎరుపు, తెలుపు గడ్డం. పొడువైన ముఖం, సిమెంట్ కలర్ ప్యాంట్, బ్రింజాల్ కలర్ ఫుల్ టీ షర్ట్ ధరించి ఉన్నాడు. మృతుడి జేబులో బాసర - రాజమండ్రి జనరల్ టికెట్ ఉంది. ఆనవాళ్ల బట్టి చూస్తే మృతుడు రాజమండ్రికి చెందిన వ్యక్తిగా పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో బద్రపర్చామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌లో నైనా, 9866167291 లేదా 9440604320 కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.


పైపులైన్ గేట్ వాల్వ్ చోరీ

వేలేరు(ధర్మసాగర్), జనవరి 19: సాగునీటి పైపులైన్ గేట్ వాల్వ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఎస్ఐ హరిత శుక్రవారం తెలిపారు. గుండ్లసాగర్ గ్రామం వద్ద పైపులైన్‌కు బిగించిన గేట్‌వాల్‌ను చోరీ చేశారు. దిని విలువ సుమారు రూ.25,000 వరకు ఉంటుందని పైపులైన్ ఇన్‌చార్జి గాదె రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.
















జంపన్నవాగు వద్ద పారిశుధ్య పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

పారిశుధ్యం పనుల పరిశీలన

మేడారంలో పర్యటించిన ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, జనవరి 19: తాడ్వాయి మండలం మేడారంలో పారిశుధ్యం పనులను ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం తిరిగి పరిశీలించారు. జంపన్నవాగు, చిలుకలగుట్ట, ఆర్టీసీ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ముందస్తుగా వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు వెంటవెంటనే పారిశుధ్యం పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మహాజాతరకు సమయం దగ్గరపడుతున్నందు ముందస్తు మొక్కులు చెల్లించే భక్తుల సంఖ్య పెరుగుతోందని అన్నారు. జంపన్నవాగులో భక్తులు పుణ్యస్నానాలు చేస్తుంటారు కాబట్టి.. ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. భక్తులకు మరుగుదొడ్లు, మూత్రశాలలు అందుబాటులో ఉండాలన్నారు. సౌకర్యాల వద్ద సిబ్బందిని నియమించాలని డీపీవో వెంకయ్యను ఆదేశించారు.

అనంతరం టీటీడీ కల్యాణ మండపంలోని మీడియా పాయింట్ పరిశీలించారు. సమ్మక్క సారలమ్మల కీర్తిప్రతిష్ఠలు దేశ నలుమూలలా తెలియజేయడంలో మీడియా కీలకపాత్ర పోషిస్తోందన్నారు. జాతర కవరేజ్ చేయడానికి వచ్చే జర్నలిస్టులకు సదుపాయాలు, సౌకర్యాలు మేరుగా కల్పించాలని, భవనంలో చేయవల్సిన మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వసంతరావు, ఎస్‌వో రాజ్‌కుమార్, గ్రామ పంచాయతీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు మొక్కుల జోరు

వనదేవతల సన్నిధికి 30వేలకు పైగా తరలివచ్చిన భక్తులు



మేడారం, జనవరి 19: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలు సమ్మక్క సారలమ్మలను దర్శించుకోవడానికి భక్తులు శుక్రవారం 30వేల మందికిపైగా భక్తులు మేడారం తరలివచ్చారు. ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు ఆదివాసీ దేవతలకు మహాజాతర ఘనంగా జరగనుంది. ఈ నేపథ్యంలో వివిధ దూరప్రాంతాలకు చెందిన భక్తులు కుటుంబ సమేతంగా మేడారం చేరుకొని తల్లుల గద్దెలకు ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈ క్రమంలో మేడారం వచ్చిన భక్తులు ముందుగా జంపన్నవాగు పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ పగిడిద్దరాజు గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. పూలు పండ్లు పసుపు కుంకుమ చీరె సారె కొబ్బరికాయలు బెల్లం(బంగారం) సమర్పించుకొని పూజాలు చేశారు. చల్లగా చూడాలని మొక్కుకున్నారు. సుమారు 30వేల మందికి పైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని మేడారం ఎగ్జిక్యూటివ్ అధికారి రాజేంద్రం తెలిపారు.



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

రేపే కొమురవెల్లి మల్లన్న పట్నంవారం

● మల్లన్న బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టం ● మూడునెలల జానపదుల జాతరకు అంకురార్పణ





చేర్యాల, జనవరి19: కొమురవెల్లి మల్లన్న ఆలయం పట్నంవారానికి సిద్ధమైంది. ఏడో తేదీన నిర్వహించిన స్వామివారి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కాగా, ఆదివారం నిర్వహించనున్న పట్నంవారంతో మూడునెలల జాతరకు అంకురార్పణ పడనున్నది. ప్రతీ ఆదివారం 12 వారాల పాటు జానపదుల జాతర సాగనుంది. శివసత్తుల సిగాలు, పోతురాజుల విన్యాసాలు, డప్పుచప్పుళ్ల దరువుతో విజయాచల గుట్టలు మార్మోగనున్నాయి.

పట్నంవారం అంటే..

సంక్రాంతి పర్వదినం తరువాత వచ్చే మొదటి ఆదివారాన్ని పట్నంవారంగా పిలుస్తుండటం అనాదిగా వస్తోంది. మల్లన్న యాదవుల ఆడబిడ్డ అయిన మేడలాదేవిని వివాహమాడిన నేపథ్యంలో యాదవులకు ఈ వారం అత్యంత ప్రీతికరం. హైదరాబాద్‌కు చెందిన యాదవ భక్తులు శనివారం ఇంటిల్లిపాదిగా కొమురవెల్లికి చేరుకుంటారు. కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోకుండానే స్వామివారిని నేరుగా ధూళి దర్శనం చేసుకుంటారు. ఆదివారం తెల్లవారుజామునే తలనీలాలు అందించి పుణ్యస్నానమాచరిస్తారు. స్థానికంగా కూరగాయలు, మట్టికుండలు కొనుగోలు చేసి భక్తిప్రపత్తులతో బోనం తయారుచేస్తారు. సంప్రదాయబద్ధంగా మల్లన్నకు బెల్లంపాయసంతో బోనం నివేదిస్తారు. పట్నం వేసి సహంపక్తి భోజనం చేస్తారు. స్వామివారిని దర్శించుకుని ఒడిబియ్యాలు సమర్పిస్తారు. అలాగే స్వామివారి తోబుట్టువు అయిన ఎల్లమ్మ దేవతకు బోనాలు చేసి నివేదిస్తారు. మరుసటి సోమవారం రోజున హైదరాబాద్‌కు చెందిన యాదవపూజారుల సంఘం ఆధ్వర్యంలో పెద్దపట్నం వేసి అగ్నిగుండాలను దాటుతారు. మల్లన్నను ఇతరుల రూపంలో భావించి వంటినిండా పసుపు ధరించి స్వామివారి ఆవాహనంతో అగ్నిగుండాల్లో చిందేసి తన్మయత్వం చెందుతారు. తరువాత వచ్చే ఆదివారాన్ని లష్కర్‌వారంగా పిలుస్తారు.

ఈ యేడు 12 వారాల జాతర

గతంలో మల్లన్న ఆలయంలో కేవలం మూడు నెలల కాలంలో ఏడు వారాల్లోనే జాతర కొనసాగేది. దీంతో సత్తేటి వారాల జాతర అని పిలిచేవారు. అప్పట్లో భక్తుల రద్దీ అంత ఎక్కువగా లేకపోవడంతో మూడు నెలలు మాత్రమే ఆలయం తెరిచి ఉండేదని, మిగతా రోజుల్లో మూసి ఉండేదని పెద్దలు చెబుతుంటారు. కాలక్రమేణా ఏయేటికాయేడు భక్తుల రాక అధికమవుతుండటంతో జాతర సమయంతో పాటు సాధారణ రోజుల్లోనూ ఆలయం రద్దీగా మారుతోంది. తిథుల ఆధారంగా బ్రహ్మోత్సవాలు కొనసాగనున్న నేపథ్యంలో ఒక్కోయేటా వారాల సంఖ్య పెరగడం, తగ్గడం జరుగుతూ వస్తోంది. ఈ క్రమంలో ఈసారి 12 వారాలపాటు జాతర సాగనుంది.

21-01-2024 మొదటి వారం (పట్నంవారం)
28-01-2024 రెండో వారం (లష్కర్‌వారం)
04-02-2024 మూడోవారం
11-02-2024 నాలుగోవారం
18-02-2024 ఐదోవారం
25-02-2024 ఆరోవారం
03-03-2024 ఏడోవారం
08-03-2024 మహాశివరాత్రి
10-03-2024 ఎనిమిదో వారం
17-03-2024 తొమ్మిదో వారం
24-03-2024 పదోవారం
31-03-2024 పదకొండోవారం
07-04-2024 పన్నెండోవారం
(అగ్నిగుండాలతో సమాప్తం)

భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు

బాలాజీశర్మ, ఆలయ ఈవో



పట్నంవారంతో పాటు జాతర మూడునెలల కాలంలో మల్లన్న ఆలయానికి తరలివచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాం. భక్తులకు త్వరితగతిన దర్శనం కలిగించడంతో పాటు అందరికీ ప్రసాదం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం. తాగునీటి వసతి కల్పించడంతో పాటు విద్యుత్ ఏర్పాట్లు చేపట్టాం. ఆలయ పరిసరాలతో పాటు పార్కింగ్ ప్రదేశాల్లో పారిశుధ్య చర్యలు నిరంతరం నిర్వహించేందుకు సిబ్బందికి సూచనలు చేశాం. భక్తులకు భద్రత కోసం పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం. రాజగోపుర ఆవరణలో కంట్రోల్‌రూం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నాం.

పార్లమెంట్ ఎన్నికలకు సీపీఐ సన్నద్ధం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాస్‌రావు

సుబేదారి, జనవరి 19: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీపీఐ పార్టీ సన్నద్ధమవుతోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కెళ్లపల్లి శ్రీనివాస్‌రావు తెలిపారు. బాలసముద్రంలోని సీపీఐ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో శ్రీనివాస్‌రావు మాట్లాడారు. జాతీయస్థాయిలో ఏర్పడిన ఇండియా కూటమిలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో సీపీఐ ఒక స్థానం కోరుతోందని, అందులో వరంగల్ పార్లమెంట్ స్థానాన్ని కోరుతున్నామన్నారు. ఈ క్రమంలో సీపీఐ పార్టీ వరంగల్ పార్లమెంట్ సమావేశం ఆదివారం ఉదయం 11 గంటలకు నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరవుతున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, నాయకులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, ఉట్కూరి రాములు, కర్రె లక్ష్మణ్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, మాలోతు శంకర్, రాసమల్ల దీనా, రమేష్‌తో పాటు పెద్ద సంఖ్యలో సీపీఐ కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

ల్యాప్‌ట్యాప్ చోరీ

హనుమకొండ క్రైం, జనవరి 19: హనుమకొండ రాజాజీనగర్‌లోని ముక్తా బాయ్స్ హాస్టల్‌లో ఓ యువకుడి ల్యాప్‌ట్యాప్ చోరీ జరిగింది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయవాడ జిల్లా ఫిష్‌మార్కెట్‌కు చెందిన తడకమల్ల వెంకటసుబ్బారావు హనుమకొండలో ఓ ప్రవేటు కంపెనీలో సేల్స్‌మెన్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. రాజాజీనగర్‌లో ముక్తా బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ ఉద్యోగం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం తన హాస్టల్ గదితో ఉన్న ల్యాప్‌ట్యాప్ కనిపించకుండా పోయింది. హాస్టల్‌లో ఎంత వెతికినా, ఎంతమందిని అడిగినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో హనుమకొండ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

దరఖాస్తుల ఆహ్వానం


హనుమకొండ రూరల్, జనవరి 19: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రతిభా కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికిగాను ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఫిబ్రవరి 5వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హనుమకొండ పెద్దమ్మగడ్డలోని గిరిజన గురుకుల ప్రతిభా (బాలికల) కళాశాల ప్రిన్సిపాల్ నందమూరి పద్మిని ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులు www.tgtwgurukulam.telangana.gov.in, http://ttwreiscoe.cgg.gov.in ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు సెల్‌నెంబర్ 9121174434లో సంప్రదించాలని సూచించారు.

నేడు, రేపు ఓటరు నమోదుపై ప్రత్యేక శిబిరాలు

హనుమకొండ రూరల్, జనవరి 19: ఫొటో ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు, తొలగింపుల కోసం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు, సవరణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 యేళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఎలాంటి పొరపాట్లు, అవకతవకలు లేకుండా స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేందుకు బూత్‌స్థాయి అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమన్వయంతో పనిచేయాలన్నారు. సంబంధిత దరఖాస్తులు బూత్‌స్థాయి అధికారుల వద్ద అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పారా మెడికల్ కోర్సులకు కౌన్సెలింగ్

హనుమకొండ అర్బన్, జనవరి 19: తెలంగాణ రాష్ట్ర పారా మెడికల్ బోర్డు ఉత్తర్వుల ప్రకారం వివిధ డిప్లొమా పారా మెడికల్ కోర్సులకు రెండో విడత, మాపప్ రౌండ్ కౌన్సెలింగ్‌ను ఈ నెల 23న నిర్వహిస్తున్నట్లు కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.మోహన్‌దాస్ తెలిపారు. కాకతీయ వైద్య కళాశాల ఆడిటోరియంలో ఉదయం 8.30 గంటలకు ఈ కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని, గత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు కూడా అర్హులేనని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. వివిధ రకాల పారా మెడికల్ కోర్సుల్లో 94 సీట్లు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు.



నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

నయీంనగర్, జనవరి 19: ఎన్‌పీడీసీఎల్ హనుమకొండ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా ఆర్ఈసీ సబ్‌స్టేషన్ పరిధిలోని రెవెన్యూకాలనీ, ప్రగతినగర్, నాగేంద్రనగర్ ప్రాంతాలలో శనివారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా సోమిడి గ్రామం, విద్యానగర్, సెయింట్ ఆన్స్ స్కూల్ ఏరియా, మార్కెట్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అడ్వకేట్స్ కాలనీ-2, హంటర్‌రోడ్డు, వరంగల్ పబ్లిక్ స్కూల్ ఏరియా ప్రాంతాలలో ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, స్నేహనగర్, రాఘవేంద్రనగర్, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, యాదవనగర్, క్రిష్ణ కాలనీ, దుర్గాకాలనీ, గౌతమినగర్, రెడ్డికాలనీ, పెట్రోల్ స్టేషన్, క్రాంతి బార్, పద్మశాలి భవన్ రాయపురవాడ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, హనుమాన్‌నగర్ డబ్బాల్, నగరవీధి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు హనుమకొండ డివిజన్ ఇంజనీర్ ఎలక్ట్రికల్, ఆపరేషన్స్ జి.సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అలాగే ఎన్‌పీడీసీఎల్ వరంగల్ డివిజన్ 11కేవీ మెయింటెనెన్స్‌లో భాగంగా జీఆర్ గుట్ట సబ్‌స్టేషన్ పరిధిలోని జీఆర్ గుట్ట, గిర్మాజీపేట, గ్రెయిన్ మార్కెట్, జేపీఎన్ రోడ్, లక్ష్మీపురం, మండిబజార్, చార్‌బౌళి ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నారు. అదేవిధంగా ఎస్ఆర్‌టీ కాలనీ, టీఆర్‌టీ కాలనీ, అబ్బనికుంట, యాకుబ్‌పూర్, ఈఎస్ఐ ఆస్పత్రి, జాన్‌పీర్లు, గొర్రెకుంట ఎక్స్‌రోడ్, నర్సంపేట రోడ్ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్నాహ్నం 12.30 గంటల వరకు, శంభునిపల్లి, ధర్మారం రోడ్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, కీర్తినగర్, గరీబ్‌నగర్, గొర్రెకుంట గ్రామం ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటలవరకు, కరీమాబాద్ రోడ్, శాంతి నగర్, రామాలయం, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, రంగశాయిపేట, మహంకాళి ఆలయం, హంస బేకరీ, కుమ్మరివాడ ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, బెస్తం చెరువు, నక్కలపల్లి ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు, ఎల్‌బీ నగర్, తిలక్ రోడ్, మోయిన్‌పుర, వరంగల్ ఆస్పత్రి లైన్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, శాంతి నగర్, సెకండ్ బ్యాంక్ కాలనీ, గాయత్రికాలనీ, మార్కండేయ గుడి, 80 ఫీట్ రోడ్డు, భారతి డిగ్రీ కాలేజీ ఏరియా ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రామన్నపేట, రఘునాథ కాలనీ, బీట్ బజార్, హంటర్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఈ మేరకు ఎలక్ట్రికల్, ఆపరేషన్ వరంగల్ డివిజనల్ ఇంజనీర్ శంకేషి మల్లికార్జున్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిట్‌లో సాంకేతిక సంబురం

ఉత్సాహంగా మొదలైన టెక్నోజియాన్

హనుమకొండ / కాజీపేట, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో శుక్రవారం ప్రతిష్ఠాత్మక వార్షిక టెక్నికల్ ఫెస్ట్ టెక్నోజియాన్-2024 ఘనంగా ప్రారంభమైంది. నిట్ క్యాంపస్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి సోమశేఖర్ టెక్నోజియాన్-2024ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్నోజియాన్-2024 నిర్వహణకు సమర్థవంతమైన ప్రణాళికను రూపొందించినందుకు స్టూడెంట్ ఆర్గనైజింగ్ టీమ్‌ను అభినందించారు. టెక్నోజియాన్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. టెక్నోజియాన్ వంటి టెక్నోఫెస్ట్‌లు విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభాపాటవాలను వెలికియడంతో పాటు వారి పరస్పరం తమ అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకునేందుకు వేదికగా నిలుస్తుందన్నారు. రానున్న రెండు రోజులు విద్యార్థులు నూతన సాంకేతిక అవిష్కరణలను ఆకళింపు చేసుకునేందుకు, సాంకేతిక విజ్ఞానాన్ని మరింత పెంపొందించేందుకు ఎంతగానో దోహదపడగలవన్నారు. స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య, స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ హరిక్రిష్ణ, ఫ్యాకల్టీ అడ్వయిజర్ ప్రొఫెసర్ హరి ప్రసాద్‌రెడ్డి ఈ సందర్భంగా హాజరయ్యారు.

మూడురోజులపాటు..

ఈ టెక్నోజియాన్‌లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ నిట్ కళాశాలల నుంచి వెయ్యి మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. ఈనెల 21వ తేదీ వరకు మూడు రోజుల పాటు జరిగే టెక్నోజియాన్‌లో భాగంగా 40కిపైగా ఈవెంట్లను ప్రదర్శిస్తారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులకు నగదు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందచేస్తారు. వరంగల్ నిట్‌లో 2006 నుంచి క్రమం తప్పకుండా ప్రతీఏటా ఈ టెక్నికల్ ఫెస్ట్‌ను నిర్వహిస్తున్నారు. ప్రతీ సంవత్సరం కొత్త ఇతివృత్తంతో దీనిని జరపడం ఆనవాయితీ. ఈ సంవత్సరం ఇంజినియస్ థీమ్‌తో దీనిని నిర్వహిస్తున్నారు. అన్వేషణ, సృజనాత్మకత, సాంకేతిక పరివర్తన స్ఫూర్తికి ప్రతీకగా ఈ థీమ్‌ను ఎంచుకున్నారు. దీనికి అనుగుణంగా టెక్నోజియాన్‌లో నిర్వహించే ఈవెంట్లు, ఎగ్జిబిట్లు, చర్చలు, ప్రముఖుల ప్రసంగాలు ఉంటాయి.

చివరి నిమిషంలో మార్పు

వాస్తవానికి టెక్నోజియాన్-2024 ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా ప్రఖ్యాత ఏరోస్పేస్, మిస్సైల్ సైంటిస్టు ప్రొఫెసర్ సుందరరాజన్ హాజరు కావలసి ఉంది. డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్‌కు చెందిన బ్రహ్మోస్, అగ్ని, పృథ్వీ, ఆకాశ్, నాగ్, త్రిశూల్ వంటి అత్యంత శక్తివంతమైన క్షిపణుల రూపకల్పన, ఉత్పత్తి, అభివృద్ధిలో కీలకభూమి పోషించిన సుందరరాజన్ రాకకోసం విద్యార్థులు ఎంతో ఆశగా ఎదురుచూశారు. ఆయనను కలవడానికి ఉత్సాహపడ్డారు. కానీ అకస్మాత్తుగా ఆయన తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో ప్రారంభోత్స కార్యక్రమానికి హాజరుకాలేకపోయారు. దీంతో చివరి నిమిషంలో కార్యక్రమంలో మార్పు జరిగింది. ప్రొఫెసర్ సుందరరాజన్ స్థానంలో నిట్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డీన్ ప్రొఫెసర్ వి.టి సోమశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై టెక్నోజియాన్‌ను ప్రారంభించారు.



విద్యుత్ వెలుగుల్లో దగద్దాయమానంగా వెలిగిపోతున్న నిట్ కళాశాల భవనం

ప్రముఖుల ప్రసంగాలు

టెక్నోజియాన్‌లో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సాంకేతిక నిపుణులు విద్యార్థులకు మార్గదర్శనం నెరుపనున్నారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో వచ్చిన మార్పులపై విద్యార్థులతో చర్చించనున్నారు. రెడ్‌బస్ సీఈవో ప్రకాశ్ సంగం, ఇస్రో శాస్త్రవేత్త టీఎస్ సురేష్‌కుమార్, ఇన్‌ఫ్లూయన్సర్ వంశీ కూరపాటి తదితరులు టెక్నోజియాన్‌కు హాజరవుతున్న ప్రముఖుల్లో ఉన్నారు. పలు సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఉన్నాయి.

40కిపైగా ఈవెంట్లు

ఈ ఫెస్ట్‌లో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఇంజనీరింగ్ విద్యార్థులు తమ వినూత్న ఆలోచనలు, సామర్థ్యాలను, ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించడానికి 40కిపైగా టాప్ క్లాస్ ఈవెంట్లను నిర్వహిస్తారు. ఈ వెంట్లను తిలకించేందుకు నిట్ విద్యార్థులే కాకుండా బయట వివిధ ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలలకుచెందిన విద్యార్థులు కూడా పెద్దసంఖ్యలో హాజరుకానున్నారు. టెక్నోజియాన్ సందర్భంగా నిర్వహించే ఈవెంట్లలో జహాజ్, ఆర్‌సీ బగ్గీ, హోవర్ మానియా, విర్చువల్ రియాలిటీ, డీబగ్గింగ్ మానియా మొదలైనవి ఉన్నాయి. ఈ రెండురోజుల్లో మ్యాట్ ల్యాబ్, టీవర్క్స్ ద్వారా రాపిడ్ ప్రోటోటైపింగ్, సిమ్యూలింక్ మాస్టర్, ఇన్నోసెర్చ్ తదితరవాటిపై వర్క్‌షాపులు కూడా ఉంటాయి. నిట్‌లోని ప్రతీ డిపార్ట్‌మెంట్ వివిధ సాంకేతిక కార్యక్రమాలను, క్విజ్‌లను నిర్వహిస్తాయి. మెకానికల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన స్పర్ధక్ బృందం వాహన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకోనున్నది.

తొలి రోజు

తొలిరోజు ఈవెంట్లు మధ్యాహ్నం 2 గంటల నుంచి మొదలయ్యాయి. మెటాల్యాజన్, ప్లేజో పవర్ ఆర్కేడ్, రీసెర్చ్ నెక్సెస్, బయో హాక్, లెర్న్ అండ్ ఎర్న్ ఎలక్ట్రిసిటీ, ఆటోమిజన్‌సైట్, బీసీ ట్రేడింగ్ పిట్, బ్రెయిన్ గేమ్ పోస్టర్ గాలా, కెమ్ ఈ ఎక్స్‌టెంపోర్, ఆర్బిక్స్ ఆర్‌సీ బగ్గీ, పజిల్ టు పేపర్, ఇన్నోకెమ్, మోడల్ డెమాన్‌స్ట్రేషన్, మైండ్ గ్రిండ్, ఏసీ సెలస్టియల్ క్లీనప్, హెచ్‌బీఏన్ ఓరిగామి, ఎన్‌హెచ్ ఇన్నోవేట్, ఎస్‌డీసీ క్రాక్ దక్వైరీ ఆర్కాడేరియం, ఆర్‌సీ బోట్‌ఆర్కేడ్, రీసెర్చ్ ఒడిస్సీ ప్రింట్ యువర్ ప్రాజెక్టు తదితర వీటిలో ఉన్నాయి.

ఈవెంట్లు మధ్యాహ్నం 3గంటల నుంచి ప్రారంభమయ్యాయి. ఎనిమిది ఈవెంట్ల మొదటి రౌండ్‌ను టెక్నోజియాన్ ప్రారంభోత్సవానికి ముందు నిర్వహించారు.



టెక్నోజియాన్-2024 నిర్వహిస్తున్న విద్యార్థుల బృందం



పాఠశాల విద్యార్థులు రూపొందించిన డిటెక్టర్ ఎగ్జిబిట్లు

ఆకట్టుకుంటున్న ఈవెంట్లు, ఆవిష్కరణలు

ప్రతిభను చాటుతున్న విద్యార్థులు.. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): టెక్నోజియాన్‌లో నిర్వహిస్తున్న ఈవెంట్లు విద్యార్థులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఆలోచింపచేస్తున్నాయి. వీటిని తిలకించేందుకు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరవుతున్నారు. వీటిలో మచ్చుకు కొన్ని..

ట్రేడింగ్ పిట్:



స్టాక్ మార్కెట్ ట్రేడింగ్ ప్రపంచం ఎలా ఉంటుందో విద్యార్థులకు అనుభవపూర్వకంగా తెలియచేయడం ఈ ఈవెంట్ ముఖ్య ఉద్దేశ్యం. ఇందులో పాల్గొనేవారు రియల్ టైమ్ (నిజ సమయం), స్టాక్ ట్రేడింగ్ సాదృశ్యాలలో పాల్గొంటారు. వీరు స్టాక్ మార్కెట్లలో రియల్ టైమ్‌లో పెట్టుబడులు పెట్టే అనుభూతిని ప్రత్యక్షంగా పొందుతారు. అనుభవాన్ని గడిస్తారు. స్టాక్ ట్రేడింగ్‌లో ఎక్కువ డబ్బు సంపాదించిన విద్యార్థులను విజేతలుగా ప్రకటిస్తారు.

ఆర్బిక్స్



ఉపగ్రహ ప్రయోగాలు, అంతరిక్ష వికిరణాల ద్వారా ఉత్పత్తయ్యే ఈ-వ్యర్థాల వల్ల పెరుగుతున్న సవాళ్లను పరిష్కరించడానికి కొన్ని క్షేత్రస్థాయిలో వినూత్నమైన రీతిలో విద్యార్థులు తమ ఆలోచనలు పంచుకునేందుకు వీలుకల్పించడం ఈ ఈవెంట్ లక్ష్యం. ఇందులో పాల్గొన్న విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై తమ ఆలోచనలను వివరించారు.

క్రాక్ ది క్వైరీ



క్రాక్ ది క్వైరీ అనేది ఎస్‌క్యూఎల్ కోడింగ్ పోటీ. ఇందులో పాల్గొనేవారు ఎస్‌క్యూఎల్‌ని ఉపయోగించి సవాళ్లను ఎదుర్కొంటారు.

ఇన్నోకెమ్



సుస్థిరమైన పర్యావరణను ప్రోత్సహించడానికి విద్యార్థులు తాము చేసిన పరిశోధనలను వివరించేందుకు వేదిక కల్పించడం ఈ ఈవెంట్ ప్రధాన ఉద్దేశ్యం. ఇందులో భాగంగా విద్యార్థులు సుస్థిర పర్యావరణంపై విద్యార్థులు వివిధ అంశాలను ప్రదర్శించారు.

హ్యాండ్ ఇన్ ప్రింట్

విద్యార్థులు తమ స్నేహితులతో గడిపిన క్షణాలను చిరకాలం జ్ఞాపకం ఉండే గుర్తులే హ్యాండ్ ఇన్ ప్రింట్ ఈవెంట్. ఒక రసాయనంలో తమ చేతులను ముంచి ఒక తెల్లని వస్త్రంపై అద్దితే ముద్రలు పడతాయి. వాటిని గుర్తుగా తమ వద్ద ఉంచుకోవచ్చు.

వీఆర్ గేమింగ్



ఇది ఒక విచిత్రమైన ఆట. మైదానంలోకి వెళ్లి క్రికెట్ ఆడడంలో పొందే అనుభూతిని కేవలం కళ్లకు ప్రత్యేకంగా రూపొందించిన గ్లాస్‌లను పెట్టుకోవడం ద్వారా పొందవచ్చు. ఈ గ్రాస్‌లను ధరించి బ్యాట్‌తో బాల్‌ను కొడితే గ్రౌండ్‌లో నిజంగా ఆడినట్టే ఉంటుంది.

విద్యార్థులకు ప్రత్యేకంగా..



ఈ టెక్నోజియాన్‌లో నిట్ విద్యార్థులే కాకుండా పాఠశాల విద్యార్థులు సైతం తమ ప్రతిభను ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. వివిధ పాఠశాలల విద్యార్థులు ఆయా సైన్స్‌ఫేయిర్లలో ప్రదర్శించిన తమ ఎగ్జిబిట్లను టక్నోజియాన్‌లో కూడా ప్రదర్శించేందుకు అవకాశం కల్పించారు. నిట్ విద్యార్థులతో పోటీ పడేలా వీరి ఎగ్జిబిట్లు ఉన్నాయి.



ఆంధ్రజ్యోతి WARANGAL CITY
వరంగల్ సిటీ
8
● వరంగల్ ● ఖిలావరంగల్ ● గీసుగొండ ● సంగెం
శనివారం 20 జనవరి 2024

'కోట కట్టను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

సంగెం, జనవరి 19: కాకతీయుల కోట కట్టను చదును చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వెంకటాపురంనకు చెందిన పలువురు సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు కాకతీయులు నిర్మించిన కట్టను ఎక్స్‌కవేటర్లతో తొలగించి చదును చేశారని ఆరోపించారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని వారు ఫిర్యాదులో కోరారు.



కాకతీయుల కట్టను తొలగించి చదును చేసిన స్థలం

'కోట'లో అభివృద్ధి పనులు



మధ్యకోటలో నూతనంగా నిర్మించిన టికెట్ కౌంటర్‌లు



శిల్పాల ఆవరణలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు



శిల్పాల ఆవరణలో నిర్మిస్తున్న డ్రైయినేజీ

ఖిలావరంగల్, జనవరి 19:మధ్యకోటలోని శిల్పాల ఆవరణలో మూడేళ్ల క్రితం కేంద్రపురావ స్తు శాఖ (ఆర్కియాలజీ)టికెట్ కౌంటర్, లైట్ అండ్ సౌండ్ షోను ప్రదర్శించేందుకు లక్షల రూపాయలు వెచ్చించి 2 టికెట్ కౌంటర్‌లను నిర్మించారు. నాలుగు నెలల నుంచి శిల్పాల ఆవరణలో పర్యాటకులు నడుస్తూ శిల్పసౌందర్యాలను తిలకించేందుకు నాపరాళ్లతో పాత్‌వేను ఏ ర్పాటు చేస్తున్నారు. శిల్పాల ఆవరణలో ఉన్న కాకతీయుల కాలంనాటి కీర్తితోరణం (ఆర్చి), ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాజముద్ర నాలుగు కీర్తితోరణాల చుట్టూ నాపరాళ్లతో అందంగా ముస్తాబు చేస్తున్నారు. రెండెళ్ల క్రితం భారీ వర్షాలు, వరదల కారణంగా శిల్పాల ఆవరణ ఆరు నెలలపాటు వరదలోనే చిక్కుకుంది. దీనిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వ ప్రభుత్వ నిధులతో శిల్పాల ఆవరణలో అండర్‌డ్రైయినేజీని నిర్మిస్తున్నారు. అండర్ డ్రెయినేజీ ఏర్పాటు చేయడం ద్వారా వరదనీరు ఆగకుండా వెళ్లేలా చూస్తున్నారు.

ప్రారంభానికి నోచుకోని బుకింగ్ కౌంటర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో శిల్పాల ఆవరణలో మూడేళ్ల క్రితం నిర్మించిన టికెట్ బుకింగ్ కౌంటర్‌లను ప్రారంభించ లేదు. దీంతో వీకెండ్స్, పండుగ సెలవులు, మహాశివరాత్రి, డిసెంబరు 31, జనవరి 1, తదితర సందర్భాలలో పర్యాటకులు, సందర్శకులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా కౌంటర్‌లను ప్రారంభించాలని పర్యాటకులు కోరుతున్నారు.

నెలరోజుల్లో ప్రారంభిస్తాం.. : మల్లేశం

మధ్యకోటలో నూతనంగా నిర్మించిన టికెట్ కౌంటర్‌లను నెల రోజుల్లో ప్రారంభిస్తామని కేంద్ర పురావస్తు శాఖా వరంగల్ జిల్లా అధికారి మడిపల్లి మల్లేశం తెలిపారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి అనుమతితో ప్రారంభిస్తామన్నారు. పర్యాటకులకు ఉత్తమ సేవలందించడమే తమ లక్ష్యమని తెలిపారు.

రెండు రోజుల పాటు ఓటరు నమోదు

సంగెం, జనవరి 19: రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్లు సంగెం తహసీల్దార్ రాజ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్‌ల వద్ద బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

సంగెం, జనవరి 19: రజక సంఘం సభ్యులకు అండగా ఉంటామని ఆ సంఘం ప్రతినిధులు చెప్పారు. శుక్రవారం కాపులకనపర్తి, మొండ్రాయి గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు వెంకట్రాజం, గౌరవ అధ్యక్షుడు మునుకుంట్ల మోహన్, కోశాధికారి రాములు, ప్రతినిధులు సారంగపాణి, శంకర్, కుమారస్వామి, ఎల్లయ్య, రవి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే నరేందర్

శంభునిపేట, జనవరి 19 : నగరంలోని 42వ డివిజన్‌కు చెందిన బీఆర్ఎస్ ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మచ్చ సుధాకర్ తండ్రి సూరయ్య ఇటీవల మృతిచెందాడు. శుక్రవారం సూరయ్య దశదినకర్మ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వచ్చి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో మచ్చ సాంబయ్య, మచ్చ సురేష్, రామాలయం ధర్మకర్త మచ్చ కవిత, కార్పొరేటర్ మరుపల్ల రవి, డివిజన్ ఇన్‌చార్జి కొంతం మోహన్, అధ్యక్షుడు కర్ర కుమార్, మండల సురేష్, ఆకుల వెంకన్న, గర్దాస్ మల్లికార్జున్, శెంకేశి పెద్ద కుమార్ పాల్గొన్నారు.

అమ్మవారిపేట జాతర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

అధికారులను ఆదేశించిన కమిషనర్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 19: అమ్మవారిపేటలో జరిగే సమ్మక్క-సారలమ్మ జాతర ఏర్పాట్లు పకడ్బందిగా ఉండాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. శుక్రవారం ఆయన అమ్మవారిపేట జాతర ప్రాంతాన్ని సందర్శించి ఏర్పాట్లను సమీక్షించారు. తాగునీరు, లైటింగ్, రహదారులు, టాయిలెట్లు, పారిశుధ్యపనులు తదితర వాటిపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. భక్తులకు ఏలోటురాకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. అమ్మవారిపేటలో నిర్మాణంలో ఉన్న 150 కేఎల్‌డీ సామర్థ్యం ప్లాంట్‌ను కూడా పరిశీలించిన కమిషనర్ పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం హనుమకొండలోని బాలసముద్రం, రాంనగర్, కిషన్‌పురా, యాదవనగర్ తదితర ప్రాంతాల్లో అనధికార నిర్మాణాలను పరిశీలించి తొలగించాల్సిందిగా అధికారులను ఆదేశించారు.



అమ్మవారిపేట జాతర ఏర్పాట్ల పరిశీలనలో కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

పన్నుల వసూళ్లు లక్ష్యాలు సాధించాలి..

ఆస్తి పన్ను వసూళ్ల లక్ష్యాలు సాధించాలని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా రెవెన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం బల్దియా ప్రధాన కార్యాలయంలో సర్కిళ్లవారిగా ఆస్తి పన్ను డిమాండ్, వసూళ్ల అంశాలను పరిశీలించారు. పెండింగ్ ఫైళ్లు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

సద్దుమణిగిన కమ్యూనిటీహాల్ సమస్య



గ్రామస్థుల సమక్షంలో పరిష్కారం చేస్తున్న అధికారులు

సంగెం, జనవరి 19: మొండ్రాయిలో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్ సమస్య ఎట్టకేలకు పరిష్కారం లభించింది. ప్రస్తుత మంత్రి, నాటి ఎమ్మెల్యే కొండ సురేఖ గ్రామస్థుల కోరిక మేరకు గ్రామంలో 25 ఏళ్లక్రితం నిర్మించడానికి నిధులను మంజూరు చేశారు. ఆ నిధులతో నిర్మించిన భవనం పనులు పూర్తయినా కాంట్రాక్టర్‌కు బిల్లు చెల్లింపులో కొంత ఆగిపోయింది. దీంతో భవనంను గ్రామపంచాయతీకి అప్పగించకుండా తన ఆధీనంలో ఉంచుకున్నాడు. గ్రామస్థులు ఐదు రోజుల క్రితం కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో కలెక్టర్ డీఆర్డీవో పీడీని సమస్య పరిష్కారం చేయాలని ఆదేశాలిచ్చారు. ఎంపీవో కొమురయ్య శుక్రవారం గ్రామాన్ని సందర్శించి సర్పంచ్ నేతృత్వంలో కంట్రాక్టర్‌తో మాట్లాడి భవనంను గ్రామపంచాయతీకి అప్పగించారు.

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.5లక్షల విలువైన సొత్తు స్వాధీనం : డీసీపీ

నర్సంపేట టౌన్, జనవరి 19: నర్సంపేట, ఖానాపు రంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీల కు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, రూ.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ డీసీపీ రవీందర్ వెల్లడించారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిందితులను మీడియా ముందు హాజరు పరిచారు. డీసీపీ మాట్లాడుతూ నర్సంపేటకు చెందిన ఎలక్ట్రీషి యన్ బాదం సాయికుమార్, ఖానాపురంనకు చెందిన మదిపెద్ది వినయ్, గొటుకుల నవీన్‌లు మద్యం, జల్సా లకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనా లకు పాల్పడే వారని పేర్కొన్నారు. ఈనెల 15న ఖానా పురంనకు చెందిన కుసుమ దినేష్, నానమ్మ రాజమ్మ వేములవాడకు మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లగా ముగ్గురు కలిసి బాదం సాయికుమార్‌కు చెందిన బైక్‌పై వెళ్లి దినేశ్ ఇంటి వద్ద చలి మంటలు వేసుకొని అర్ధరాత్రి రాజమ్మ ఇంటి తాళాన్ని ఇనుప పైపుతో పగులగొట్టి, బంగారు వెండి, నగలను దొంగిలించారని తెలిపారు. అలాగే, ఈనెల 17న నర్సంపేట పట్ట ణంలోని టీచర్స్ కాలనీలో రెండు ఇళ్లకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించి ముగ్గురు కలిసి గొటుకుల నవీన్ బైక్‌పై టీచర్స్ కాలనీకి వెళ్లి మొలుగూరి నాగేం దర్, ఇమ్మడి వెంకటేశ్వర్లు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారని డీసీపీ తెలిపారు. ఒకరి ఇం ట్లోని బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదు, మరొకరి ఇంట్లో వెండి పల్లెం, వెండి తాం బాలం, రెండు వెండి ఏనుగు బొమ్మలు, జత వెండి పట్టాగొలుసులు, కొన్ని వెండి పూజ సామగ్రిని దొంగ తనం చేసినట్లు వివరించారు. దొంగతనం చేసిన వెం డి, బంగారు వస్తువులను వరంగల్‌లో విక్రయించేం దుకు రెండు బండ్లపై వరంగల్‌కు ఖానాపురం శివారు పాఖాల వాగు బ్రిడ్జి వద్ద నుంచి వెళ్తుండగా, పక్కా సమాచారంతో దుగ్గొండి సీఐ కిషన్, ఖానాపురం ఎస్సై బి.మాధవ్, నర్సంపేట సీఐ ఎస్.రవికుమార్, ఎస్సై ఎస్.రవి, సీహెచ్ రాజులు పట్టుకొని సొత్తును రికవరీ చేసినట్టు తెలిపారు. ఈమేరకు ఎస్సైలతో పాటు సిబ్బంది సుమన్, రవీందర్, సీతారామరాజు, యర్రై య్య, రవి, సునిల్‌లను, సూచనలను ఇచ్చిన నర్సం పేట సీఐ తిరుమల్‌ను డీపీపీ పి.రవీందర్ అభినం దించారు.



నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో మీడియాసమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్, (ముసుగు ధరించిన ముగ్గురు దొంగలు)

ఆలయాన్ని సందర్శించిన అధికారులు



ఆలయాన్ని పరిశీలిస్తున్న అధికారులు

శంభునిపేట, జనవరి 19 : రంగశాయిపేటలోని రంగనాయకుల ఆలయాన్ని శుక్రవారం దేవాదాయ శాఖ అధికారులు సందర్శించారు. ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. కమిటీ సభ్యుడు ఇటికాల అశోక్ ఆలయ విశిష్ఠతను తెలుపుతూ సమస్యలను వివరించారు. కాకతీయుల కంటే పూర్వమే ఆలయం నిర్మించారని, ఈ ఆలయం పేరునే ఈ ప్రాంతానికి రంగశాయిపేట అనే పేరు వచ్చిందని వివరించారు. ఆలయ రంగనాయక భజనమండలి, రంగనాయక ట్రస్టు కమిటీ, రంగనా యక మహిళా మండలి సభ్యులు ఆలయాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ఎమ్మె ల్యే, దేవాదాయ శాఖ మంత్రిని ఇటీవల కోరారు. మంత్రి ఆదేశానుసారం వరంగల్ ఈఈ కొలును దుర్గాప్రసాద్, డీఈ చిమ్మని రమేష్ బాబు, ఏఈ దుర్గా ప్రసాద్‌లు ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కేడల పద్మజనార్దన్ పాల్గొన్నారు.

నేడు, రేపు నీటి సరఫరా బంద్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 19: వరంగల్ అండర్ రైల్వే గేట్ పరిధిలో శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తునట్లు బల్దియా ఈఈ శ్రీరామోజు శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమ్మవారిపేట వద్ద మిషన్ భగీరథ పైప్‌లైన్ పనులు జరుగుతున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కరీమాబాద్, ఉర్సు, శివనగర్, పెరుకవాడ, చింతల్, పుప్పాలగుట్ట, ఖిలావరంగల్, తూర్పు, మధ్య కోట, ఎస్ఆర్ఆర్ తోట, ఏసీరెడ్డినగర్, నాగమయ్యగుడి, రుద్రమనగర్ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

హీరో మోటోకార్ప్ కంపెనీ నూతన షోరూమ్ ప్రారంభం

హనుమకొండ, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలోని వెంకట్రామా థియేటర్ జంక్షన్ సమీపంలో హీరో మోటోకార్ప్ కంపెనీ వారి డీలర్‌షిప్ గీతా ఆటోమొబైల్స్ అత్యాధునిక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన నూతన షోరూమ్ ను శుక్రవారం హీరో మోటోకార్ప్ సౌత్ జోనల్ మేనేజర్లు రాము, ప్రకాశ్‌రావు ప్రారంభించారు. ఈ కార్యక్రమ ంలో హీరో మోటోకార్ప్ తెలంగాణ రాష్ట్ర ఏరియా మేనేజర్ మనీష్ జైన్, తెలంగాణ రాష్ట్ర సర్వీస్ మేనేజర్ చంద్రకాంత్ చమోలి, హీరో మెటోకార్ప్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ గినిగు సత్యనారాయణరెడ్డి, శుభనందిని గ్రూప్ కంపెనీ చైర్మెన్ రాంబాబు, షోరూమ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న రాము, ప్రకాశ్ రావులు

సీఎంఆర్ఎఫ్ చెక్‌ను అందజేసిన నాయిని



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను అందచేస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, జనవరి 19: హనుమకొండ బొక్కలగడ్డకు చెందిన అబ్దుల్ ఖాదిర్ మహ్మద్ చికిత్స నిమిత్తం మంజూరైన రూ.2.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అందచేశారు. శుక్రవారం హనుమకొ ండలోని ప్రజాభవన్ కార్యాలయంలో ఖాదిర్ కూతురు అయేషా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నుంచి చెక్ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ బొమ్మతి విక్రమ్, 6వ డివిజన్ అధ్యక్షుడు అగార్తీది శివాజీ, వరంగల్ పశ్చిమ సోషల్ మీడియా కార్యదర్శి బొమ్మతి రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ నగరం నేర్చుకునే వేదిక

పారిశుధ్య విధానాలపై జపాన్ ప్రతినిధుల కితాబు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జన వరి 19 : వరంగల్ నగరం నేర్చుకునే వేదిక వంటిందని జపాన్ దేశ ప్రతినిధులు అభివర్ణించారు. పారిశుధ్య విధానాలు భేషుగ్గా ఉన్నా యని కితాబిచ్చారు. జపాన్‌కు చెందిన ఇంటర్నే షనల్ కో ఆపరేషన్ అండ్ ప్రాజెక్టు డిపార్ట్‌మెం ట్ డైరెక్టర్ కత్సుయోషి సుడో, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ మేనేజర్ డాక్టరు ఫైర్రే ఫ్లెమండ్ శానిటే షన్ అధ్యాయనాల కోసం శుక్రవారం వరంగల్ నగరానికి వచ్చారు. నగరంలో పారిశుధ్య విధానాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ, వరంగల్ అమ్మవారిపేటలోని మానవ మలవ్యర్థాల నిర్వ హణ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ నిర్వహణ, వ్యర్థాలతో ఎరువు ఉత్పత్తి, నీటి ఉత్పత్తి వివరా లను అడిగి తెలుసుకున్నా రు. సెప్టిక్ ట్యాంకుల పరి శుభ్రత, నగరవాసుల్లో చైతన్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధా రాణితో భేటీ అయ్యారు. నగరంలోని పారిశుధ్య విధానాలను మేయర్ కూలంకషంగా వివరించారు. జపాన్ శానిటేషన్ కౌన్సిల్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధులు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అందచేసిన అసైన్‌మెంట్‌ను కూడా అధ్యయనం చేసినట్లు మేయర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్కి ప్రతినిధి డాక్టరు రాజ్‌మోహన్‌రెడ్డి, అవినాశ్ పాల్గొన్నారు.



మేయర్‌తో భేటి అయిన జపాన్ దేశ ప్రతినిధులు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసిన అనిల్

హనుమకొండ సిటీ, జనవరి 19: హనుమకొండకు చెందిన ఏఐసీసీ జాతీయ సమన్వయకర్త డాక్టరు పులిఅనిల్‌కుమార్ శుక్రవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్లమె ంట్ ఎన్నికల్లో ఎంపీగా పోటీ చేసేందు కు తనకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పార్టీకి చేసిన సేవలను ఈ సందర్భంగా అనిల్‌కుమార్ భట్టికి వివరించారు.



డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి వివరిస్తున్న డాక్టర్ అనిల్‌కుమార్





టపాసులు కాలుస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నేతల సంబరాలు

వర్ధన్నపేట, జనవరి 19 : బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఎన్నికైన సందర్భంగా శుక్రవారం బీజేపీ నాయకులు వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సర్కిల్‌లో టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు చీటూరి రాజు, మండల అధ్యక్షుడు రాయపురపు కుమారస్వామి, పెద్దూరి రాజ్ కుమార్, కొండేటి సత్యం, గిరిప్రసాద్, దేవేందర్‌రావు, బాబు, సందీప్, మల్లెపాక అనిల్, కామ రవి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి పుత్రులు బంజారులు

• మాజీ ఎంపీ సీతారాం నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

నెక్కొండ, జనవరి 19 : ప్రకృతి పుత్రులైన బంజారులలో ఐక్యత లోపించడంతో రాజ్యాంగం నుంచి గుర్తింపు లభించకపోవడంతో వెనుకబడుతున్నారని మహబూబాబాద్ మాజీ ఎంపీ సీతారాంనాయక్ అన్నారు. మండలంలోని గొట్లకొండ గ్రామ శివారు బీక్యా తండాలో నిర్మాణం చేయనున్న సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, మాట్లాడారు. నర్సంపేట నియోజక వర్గంలో అతిపెద్ద సేవాలాల్ దేవాలయం నిర్మాణానికి శ్రీకారం చుట్టటడం అభినందనీయమన్నారు. అధికారం కోసం గిరిజనుల మద్దతు పొందుటకు గాను వివిధ రాజకీయ పార్టీలు రూపొందిస్తున్న సంక్షేమ పథకాల కోసం చూడకుండా గిరిజనులు ఉన్నత విద్యావంతులు కావాలన్నారు. దీంతో ఆ కుటుంబాలు అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధిస్తాయన్నారు. 18వ శతాబ్దంలో జన్మించిన సేవాలాల్ గిరిజనుల అభివృద్ధికి తన వంతు సేవలను అందించారన్నారు. సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15న ఉందని, ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బంజారుల జీవిత చరిత్రను లిఖితపూరిత చరిత్రగా మార్చాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాలోతు వెంకన్న, గొట్లకొండ గ్రామ సర్పంచ్ కునుసోతు తులసివెంకట్, నెక్కొండ ఎంపీపీ జాటోతు రమేశ్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్, ఎంపీటీసీ కునుసోత్తు సరోజశంకర్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు జాటోతు భిక్షపతి, శంకర్‌నాయక్, శ్రీనివాస్, శివలాల్, నవీన్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

తుంగబంధం ఉప కాలువలు ఆక్రమణ

• చివరి ఆయకట్టుకు అందని సాగు నీరు
• ఆందోళనలో పాపయ్యపేట గ్రామ రైతులు
• చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు, పాలకులు



ఉప కాలువను తొలిగించిన దృశ్యం

చెన్నారావుపేట, జనవరి 19 : పాకాల ఆయకట్టు కింద ఉన్న తుంగబంధం ప్రధాన కాలువకు చివరి ఆయకట్టు కింద ఉన్న ఉప కాలువలను ఆక్రమణ చేశారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాకాల ఆయకట్టుకు రంగాపురం మీదుగా మండలంలోని పాపయ్యపేట గ్రామానికి వచ్చే తుంగబంధం కాలువకు ఉన్న ఉప కాలువ కింద సుమారు 25 నుంచి 30 ఎకరాల వరకు సాగు నీరందుతుంది. కాలువ ఉన్నప్పటి నుంచి కింది ఆయకట్టు రైతులకు సాగు నీరందిస్తున్నారు. ఇటీవల ఉప కాలువలను కొందరు వ్యక్తులు పూర్తిగా తొలగించి చదును చేసుకొని వరి పంటలను సాగు చేయడానికి సిద్ధం చేస్తున్నరని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాపయ్యపేట గ్రామానికి చెందిన బోడ జగ్యా, మిరియాల నర్సయ్య, మిరియాల కుమారస్వామి, బోడ హరియా, వెంకన్న, బోడ నర్సింహ లతో పాటు పలువురు వ్యక్తులు కలిసి ఉప కాలువలను తొలిగించిన హద్దులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో కింది ఆయకట్టు రైతులకు సాగు నీరందటం చాలా కష్టంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయంపై ఆక్రమించే వ్యక్తులను నిలదీసి అడిగితే కాలువల విషయంలో మీ ఇష్టం ఉన్న చోట చెప్పుకోండి అంటూ దబాయిస్తున్నారని రైతులు తెలిపారు. అంతేకాకుండా ఇదే విషయంపై పోలీసు స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. ఉప కాలువలు లేకుండా అన్యాక్రాంతమవుతున్న సంబంధిత రెవెన్యూ అధికారులు, పాలకులు పట్టించుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉప కాలువలను తొలిగించిన వ్యక్తులపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు పలువురు కోరుతున్నారు.



కాలువను తొలిగించి, నాటిన హద్దు రాళ్లు

ఎస్‌ఎంసీ నియామకంపై నేడు షెడ్యూల్ విడుదల

దుగ్గొండి, జనవరి 19 : ఐదేళ్ల తర్వాత పాఠశాలలకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్‌ఎంసీ) ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు గురువారం జారీచేయడంతో పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంపికకు శనివారం షెడ్యూల్ విడుదల చేయనున్నారు. 2019 నవంబరులో ఎస్‌ఎంసీ కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఆ కమిటీ బాధ్యతలు రెండు ఏండ్లు కొనసాగవలసి ఉండగా, అదనంగా మూడేళ్లు పొడిగించుకుంటూ వచ్చారు. ఎన్నికలు ఈ నెల 29న జరుపాలని అధికారులు వెల్లడించడంతో పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాలను సిద్ధం చేస్తున్నారు. నేడు పాఠశాలలో ఎన్నికల షెడ్యూల్‌ను నోటీసు బోర్డుపై పెట్టనున్నారు. 20న నోటిఫికేషన్ జారీ, తల్లిదండ్రుల ఓటర్ల జాబితా ప్రకటన, 22, 23న జాబితాలపై అభ్యంతరాలు 24న తుది జాబితా విడుదలచేస్తారు. 29న ఎన్నికలు ఉంటాయి. మండలంలో 45 పాఠశాలలో ఎన్నికలు నిర్వహించి కమిటీలు ఏర్పాటు కానున్నాయి. 24 ప్రాథమిక పాఠశాలలు, 7 ఉన్నత పాఠశాలలు, 7 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఒకటి కస్తూర్బా విద్యాలయం, ఒకటి జ్యోతిరావు పూలే విద్యాలయం, ఒకటి సాంఘిక సంక్షేమ పాఠశాల, 4 ప్రైవేట్ పాఠశాలలకు ఎన్నికలు జరుగుతాయి.

ఎంపీడీవోకు చేదు అనుభవం

• మీరు మాట్లాడుతుంటే ఎఫ్‌ఎం విన్నట్టుంది..!
• ఎంపీడీవో స్పీచ్‌పై ప్రజల ఆగ్రహం
• ఇల్లంద గ్రామ సభలో ప్రజల నిలదీత



గ్రామ సభలో పాల్గొన్న ఎంపీడీవో రాజ్యలక్ష్మి, ప్రజాప్రతినిధులు

వర్ధన్నపేట రూరల్, జనవరి 19 : వర్ధన్నపేట ఎంపీడీవో రాజ్యలక్ష్మికి చేదు అనుభవం ఎదురైంది. శుక్రవారం వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలో జరిగిన అభివృద్ధి ప్రణాళిక పై గ్రామ సభలో ప్రసంగిస్తుండగా స్థానిక ప్రజలు గ్రామాభివృద్ధిపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా సభలో 9వ వార్డుకుచెందిన పోశాల మధుకర్ అనే వ్యక్తి తన ఇంటి ముందు రోడ్డు వేయడం లేదని, జీపీలో తీర్మానం చేసినప్పటికీ రోడ్డు నిర్మాణంలో జాప్యం ఎందుకు జరుగుతుందో చెప్పాలని డిమాండ్ చేశాడు. ఎంపీడీవో స్పందిస్తూ దానికి గల కారణాలు చెపుతుండగా ఆమె స్పీచ్ ముగిసిన అనంతరం మీరు చెప్పింది ఏమి అర్థంకాలేదని ఎఫ్‌ఎం రేడియో మాదిరిగా ఉందని చెపుతూ సభలోనే నిలదీశాడు. దీనిపై ఎంపీడీవో రాజ్యలక్ష్మి స్పందిస్తూ జీపీ కార్యదర్శి రామారావు పూర్తిగా వివరిస్తాడని బదులిచ్చింది. ఎంపీడీవోను నిలదీసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం చర్చనీయాంశమైంది.

• అభివృద్ధి పనులపై నిలదీత...

ఇల్లంద గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై గ్రామస్తులు సభలో అధికారులను, ప్రజా ప్రతిధులను నిలదీశారు. రోడ్లు, కాల్వల తీరుపట్ల అసహనం వ్యక్తం చేశారు. వర్షాలు కురిస్తే నీరు పోయేందుకు శాశ్వత పరిష్కారాలు చూపాలని డిమాండ్ చేశారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుంకరి సాంబయ్య, ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ రాజ్‌కుమార్, వార్డు సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిని కలిసిన మండల నాయకుడు



రవికుమార్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కర్ణాకర్‌గౌడ్

దుగ్గొండి, జనవరి 19 : నూతనంగా నియామకమైన బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఘంట రవికుమార్‌ను వరంగల్‌లోని ఆయన స్వగృహంలో శుక్రవారం మండల బీజేపీ మాజీ అధ్యక్షుడు ఏరుకొండ కర్ణాకర్ గౌడ్ కలసి పుష్పగుచ్ఛం అందించి, అభినందనలు తెలిపారు. బీజేపీ బలో పేతంకోసం కృషిచేయాలని కోరినట్లు కర్ణాకర్‌గౌడ్ వెల్లడించారు.

గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను గుర్తించాలి

చెన్నారావుపేట, జనవరి 19 : గ్రామాభివృద్ధికి ఉపయోగపడే పనులను గుర్తించాలని ఎంపీడీవో ఈగల భారతి అన్నారు. శుక్రవారం మండలంలోని ఖాదర్‌పేట, గొల్లబామ తండా, తొపనగడ్డతండా, చెరువుకొమ్ముతండా, గొల్లపల్లె, పాపయ్యపేటలతో పాటు పలు గ్రామాల్లో గ్రామ అభివృద్ధిపై గ్రామ సభలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సమస్యాత్మకంగా ఉన్న పనులను ప్రజలు తెలియజేయాలన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు సాధ్యమవుతాయన్నారు. ప్రజలందరూ గ్రామాభివృద్ధికి రెండు రోజులుచేపట్టే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్‌రాజు, సూపర్‌వైజర్ మంజుల, సర్పంచ్ అనుముల కుమార స్వామి, ఏపీవో అరుణ, కార్యదర్శులు, సీసీ శ్రీలత, కానిస్టేబుల్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు

నల్లబెల్లి, జనవరి 19 :మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ఈ నెల 20న విద్యుత్ వినియోగదారుల అవగాహన సదస్సు ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ సదస్సును విద్యుత్ వినియోగదారులు సంపూర్ణంగా ఉపయోగించుకోవాలని మండల విద్యుత్ ఏఈ రవళి తెలిపారు. విద్యుత్ పట్ల విద్యుత్ వినియోదారులకు ఏర్పడే ప్రధాన సమస్యలను ఈ సదస్సులో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు జిల్లా, డివిజన్ విద్యుత్ అధికారులు హాజరై, వినియోగదారుల సమస్యలపై పూర్తి అవగాహన కల్పిస్తారన్నారు. నల్లబెల్లి, దుగ్గొండి తదితర విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముదిరాజ్ మహిళా సొసైటీ ఎన్నిక

రాయపర్తి, జనవరి 19 : మండలంలోని సన్నూరు గ్రామంలో శుక్రవారం మహిళా ముదిరాజ్ సొసైటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అబ్జర్వర్ మత్స్యశాఖ డీసీవో విమల ఆధ్వర్యంలో ఈ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కాయిత శోభ, ఉపాధ్యక్షురాలిగా గూబ స్వప్న, కార్యదర్శిగా గూబ జ్యోతి, డైరెక్టర్‌గా గూడ సుహాసిని, కాయిత యాకమ్మ, గూడ స్వరూప, కాయిత లచ్చమ్మ, సమ్మక్క, రమ తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

వరంగల్ నగరం నేర్చుకునే వేదిక

• పారిశుధ్య విధానాలపై జపాన్ ప్రతినిధుల కితాబు

జీడబ్ల్యూఎంసీ (హనుమకొండ సిటీ), జనవరి 19 : వరంగల్ నగరం నేర్చుకునే వేదిక వంటిందని జపాన్ దేశ ప్రతినిధులు అభివర్ణించారు. పారిశుధ్య విధానాలు భేషుగ్గా ఉన్నా యని కితాబిచ్చారు. జపాన్‌కు చెందిన ఇంటర్నేషనల్ కో ఆపరేషన్ అండ్ ప్రాజెక్టు డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ కత్సుయోషి సుడో, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ మేనేజర్ డాక్టరు పైర్రే ఫ్లెమండ్ శానిటేషన్ అధ్యాయనాల కోసం శుక్రవారం వరంగల్ నగరానికి వచ్చారు. నగరంలో పారిశుధ్య విధానాలు, పబ్లిక్ టాయిలెట్ల నిర్వహణ,వరంగల్ అమ్మవారిపేటలోని మానవ మలవ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎఫ్‌ఎస్‌టీ ప్లాంట్ నిర్వహణ, వ్యర్థాలతో ఎరువు ఉత్పత్తి, నీటి ఉత్పత్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెప్టిక్ ట్యాంకుల పరి శుభ్రత, నగరవాసుల్లో చైతన్యం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో మేయర్ గుండు సుధా రాణితో భేటీ అయ్యారు. నగరంలోని పారిశుధ్య విధానాలను మేయర్ కూలంకషంగా వివరించారు. జపాన్ శానిటేషన్ కౌన్సిల్ అసోసియేషన్‌కు చెందిన ఇద్దరు ప్రతినిధులు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ అందచేసిన అసైన్‌మెంట్‌ను కూడా అధ్యయనం చేసినట్లు మేయర్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్కి ప్రతినిధి డాక్టరు రాజ్‌మోహన్‌రెడ్డి, అవినాశ్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌బీఐ మేనేజర్ మోహన్‌లాల్



ప్రొజెక్టర్‌తో అవగాహన కల్పిస్తున్న బ్యాంక్ మేనేజర్ జనార్ధన్

చెన్నారావుపేట, జనవరి 19 : కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్యాంక్ మేనేజర్ మోహన్‌లాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లపల్లె గ్రామంలో భారత్ సంకల్ప యాత్రంలో భాగంగా ప్రజలకు కేంద్ర పభుత్వ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకులు అందిస్తున్న ఇన్సూరెన్స్ పథకాలు, రుణాలు, సబ్సిడీ పథకాలను వినియోగించుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలందరూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ, సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేష్, ఎంపీడీవో భారతి, ఏపీఎం ఈశ్వరయ్య, యూనియన్ బ్యాంక్ మేనేజర్ కల్యాణ్, సూపర్ వైజర్ రాధ, సీసీ శ్రీలత, సుగుణ, రాధిక, తదితరులు పాల్గొన్నారు.

• నల్లబెల్లి : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ అవగాహన సదస్సు ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ మేనేజర్ జనార్ధన్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సర్పంచ్ రాజారాం అధ్యక్షతన జీపీ ఆవరణలో శుక్రవారం ప్రొజెక్టర్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ జనార్ధన్ మాట్లాడుతూ.. బ్యాంకుల ద్వారా పోస్ట్ ఆఫీస్‌ల ద్వారా అందించే కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎం సురక్ష బీమా యోజన, పీఎం జీవన జ్యోతి, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి యోజన, ప్రధాన మంత్రి ఉజ్వల యోజన తదితర పథకాలను సంపూర్ణంగా ప్రజల్లోకి తీసుకెళ్లి, వికసిత భారతం చేయడంలో తమ వంతు కృషి ఉండాలనే తాపత్రాయంతో ఈ సదస్సును ఏర్పాటు చేసి, ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నానబోయిన రాజారాం, వైద్యాధికారి శశికుమార్, ఏపీఎం సునీత, పంచాయతీ కార్యదర్శి ధర్మేందర్, ఎంపీటీసీ జన్ను జయరావు తదితరులు పాల్గొన్నారు.

లింగగిరి చెన్నకేశస్వామి జాతర హుండీ లెక్కింపు

• జాతర ఆదాయం రూ. 2లక్షల 601



హుండీ లెక్కింపు చేస్తున్న సర్పంచ్, కమిటీ నిర్వహకులు

చెన్నారావుపేట, జనవరి 19 : మండలంలోని లింగగిరిలో మకర సంక్రాతి పండుగ పురస్కరించుకొని నాలుగు రోజుల పాటు నిర్వహించిన లక్ష్మీ చెన్నకేశవస్వామి జాతర హుండీ లెక్కింపును శుక్రవారం చేపట్టారు. గ్రామంలోని జాతర ద్వారా రూ.2,00,601 వచ్చినట్లు సర్పంచ్ మదారాపు భాస్కర్‌లు తెలిపారు. గ్రామంలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం ఆవరణలో ఆలయ కమిటీ నిర్వహకులు హుండీ లెక్కింపును నిర్వహించారు. హుండీ ఆదాయం రూ.1,29,601లు, కొబ్బరికాయల దుకాణాలు, ఐస్‌క్రీమ్, జ్యూస్ తదితర టెండర్ల ద్వారా రూ.71వేల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సముద్రాల సుదర్శనచార్యులు, రమణాచార్యులు, పులి శోభన్, మల్లం సాగర్, ఉప సర్పంచ్ రాజశేఖర్, రాకం వేణు, రాకం శ్రీనువాస్, సాదే బోయిన రాజు, చీకటి వెంకటేశ్వర్లు, మల్లం సాగర్, వేణు, ఒరుగంటి నర్సింహా రావు, దాసరి అశోక్, కార్యదర్శి శ్యామ్, కారోబార్ దాసరి రమేష్, అనుముల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ నిధులను విడుదల చేయాలి

టీపీఎఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్



నియామక పత్రాన్ని అందజేస్తున్న ప్రేమ్ కుమార్

నర్సంపేట, జనవరి 19 : ఎస్సీ కార్పొరేషన్ నిధులను వెంటనే విడుదల చేయాలని, తెలంగాణ పేదల ఆర్థిక రాజ్యాధికార సమితి (టీపీఎఆర్ఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు సింగారం ప్రేమ్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలో శుక్రవారం టీపీఎఆర్ఎస్ సమావేశాన్ని నిర్వహించి వరంగల్ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని దళితులకు గతంలో క్రమం తప్పకుండా రుణాలను అందించేవారన్నారు. మండలానికి 5 వేల యూనిట్లతో ఎస్సీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు నందించే వారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను ఆగం చేసిందన్నారు. దళితుల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతంలో మాదిరిగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2022, 2023 సంవత్సరాలకు సంబంధించిన రుణాలు విడుదల చేసి దళితులను ఆదుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో టీపీఎఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రాములు గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు రాంపాక మధుకర్, జిల్లా కార్యదర్శి శనిగరపు వీరసామి. సహాయ కార్యదర్శి మల్లేష్ యాదవ్, నర్సంపేట మండల కమిటీ అధ్యక్షుడు కోడెపాక మొగిలి. ఆల్ ఇండియా పేదల స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సింగారం టెన్నీ పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

నల్లబెల్లి, జనవరి 19 : ఎన్నికల్లో ప్రజలకు ఎన్నో ఆశాజనకమైన హామీలను ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఆయా హామీలను వెంటనే అమలు చేయాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఎంసీపీఐ(యూ) బోర్డును ఏర్పాటుచేసి, కార్యాలయ ఆవరణలో మండలపార్టీ అధ్యక్షుడు దామ సాంబయ్య అధ్యక్షతన సమావేశం జరిగింది. పెద్దారపు రమేష్ మాట్లాడుతూ మనువాద భావ జాలంతో బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తుందన్నారు. ప్రజలకు మభ్యపెట్టి మళ్లీ గెలిచేందుకు మోదీ ప్రభుత్వం అయోధ్య రామ మందిరం పేరుతో కుట్రలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు గోనె కుమారస్వామి, నాగెల్లి కొమురయ్య, కుసుంబ బాబురావు, కన్నం వెంకన్న, జన్ను రమేష్, మార్త నాగరాజు, కర్నె సాంబయ్య, నాగెల్లి వెంకటేష్ పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు

• రూ.5 లక్షల విలువైన సొత్తు స్వాధీనం : డీసీపీ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రవీందర్

నర్సంపేట టౌన్, జనవరి 19 :నర్సంపేట, ఖానాపురంలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు దొంగలను అరెస్టు చేసి, రూ.5లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ డీసీపీ రవీందర్ వెల్లడించారు. నర్సంపేట పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిందితులను మీడియా ముందు హాజరు పరిచారు. డీసీపీ మాట్లాడుతూ నర్సంపేటకు చెందిన ఎల్లక్రీషియన్ బాదం సాయికుమార్, ఖానాపురంనకు చెందిన మదిపెద్ది వినయ్, గొటుకుల నవీన్‌లు మద్యం, జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించి దొంగతనాలకు పాల్పడే వారని పేర్కొన్నారు.

ఈ నెల 15న ఖానా పురంనకు చెందిన కుసుమ దినేష్, నానమ్మ రాజమ్మ వేములవాడకు మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లగా ముగ్గురు కలిసి బాదం సాయికుమార్‌కు చెందిన బైక్‌పై వెళ్లి దినేశ్ ఇంటి వద్ద చలి మంటలు వేసుకొని, అర్ధరాత్రి రాజమ్మ ఇంటి తాళాన్ని ఇనుప పైపుతో పగులగొట్టి, బంగారు వెండి, నగలను దొంగిలించారని తెలిపారు.

అలాగే, ఈనెల 17న నర్సంపేట పట్ట ణంలోని టీచర్స్ కాలనీలో రెండు ఇళ్లకు తాళాలు వేసి ఉండడాన్ని గమనించి ముగ్గురు కలిసి గొటుకుల నవీన్ బైక్‌పై టీచర్స్ కాలనీకి వెళ్లి మొలుగూరి నాగేందర్, ఇమ్మడి వెంకటేశ్వర్లు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారని డీసీపీ తెలిపారు. ఒకరి ఇంట్లోని బీరువాలో ఉన్న రూ.3లక్షల నగదు, మరొకరి ఇంట్లో వెండి పల్లెం, వెండి తాం బాలం, రెండు వెండి ఏనుగు బొమ్మలు, జత వెండి పట్టాగొలుసులు, కొన్ని వెండి పూజ సామగ్రిని దొంగ తనం చేసినట్లు వివరించారు. దొంగతనం చేసిన వెండి, బంగారు వస్తువులను వరంగల్‌లో విక్రయించేం దుకు రెండు బండ్లపై వరంగల్‌కు ఖానాపురం శివారు పాఖాల వాగు బ్రిడ్జి వద్ద నుంచి వెళ్తుండగా, పక్కా సమాచారంతో దుగ్గొండి సీఐ కిషన్, ఖానాపురం ఎస్సై బి.మాధవ్ గౌడ్, నర్సంపేట సీఐ ఎస్.రవికుమార్, ఎస్సై ఎస్.రవి, సీహెచ్ రాజులు పట్టుకొని సొత్తును రికవరీ చేసినట్టు తెలిపారు. ఈ మేరకు ఎస్సైలతో పాటు సిబ్బంది సుమన్, రవీందర్, సీతారామ రాజు, యర్రై య్య రవి, సునిల్‌లను, సూచనలను ఇచ్చిన నర్సం పేట సీఐ తిరుమల్‌ను డీసీపీ పి.రవీందర్ అభినందించారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే దొంతి పరామర్శ

దుగ్గొండి, జనవరి 19 : మండలంలోని శివాజీ నగర్‌లో ఇటీవల మృతి చెందిన బుసారి లక్ష్మీ, బందంపల్లిలో మృతిచెందిన పోరెడ్డి వీరారెడ్డి కుటుంబాలను శుక్రవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సందర్శించి పరామర్శించారు. మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్ రెడ్డి, పీసీసీ సభ్యుడు పెండెం రామనాధం, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు చెన్నూరి కిరణ్‌రెడ్డి, ఒలిగె నర్సింగరావు, ఎస్టీ సెల్ డివిజన్ అధ్యక్షుడు జయరాం, యువజన సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి కొల్లూరి రాజు, భరత్‌రెడ్డి, నాగరాజు, రోహిత్, లోనే శ్రీనివాస్, బొల్ల స్వామి, రాజు, రాజేశ్వర్‌రావు, వేణు, రామన్న తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శలు

చెన్నారావుపేట, జనవరి 19: మండలంలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన నార్లపురం కొంరమ్మ (85) అనారోగ్యంతో మృతిచెందగా, మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పలువురు నాయకులు పరామర్శించారు. ఎంపీటీసీ కడారి సునిత సాయిలు, బీఆర్ఎస్ నాయకులు బుర్రి తిరుపతి, బాల్నె వెంకన్నగౌడ్, సొసైటీ చైర్మన్ మురహరి రవి, బుర్రి యాదగిరి, ఎర్ర రాజుకుమార్, శీలం సాంబయ్య, భిక్షపతి, జన్ను నరేష్ తదితరులు ఉన్నారు.